టీబీజీకేఎస్ పిట్ కమిటీ ఎన్నిక

న్యూటెక్ గనిపై సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, నాయకులు

శ్రీరాంపూర్, నవంబర్ 12 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గనిపై మంగళవారం టీబీజీకేఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పాల్గొని గని నూతన కమిటీని నియమించారు. కార్యదర్శిగా ఉప్పాల సంపత్, సహాయ కార్యదర్శిగా జైపాల్‌రెడ్డి, జనరల్ షిఫ్ట్ కార్యదర్శిగా అట్లూరి అనిల్‌కుమార్, ఏ, బీ, సీ రిలే కార్యదర్శులుగా అడ్డూరి అనిల్, రాజ్‌కుమార్, జై కృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజుతో పాటు 50 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిట్ కార్యదర్శి ఉప్పాల సంపత్ మాట్లాడుతూ.. న్యూటెక్ గనిలో టీబీజీకేఎస్ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో పిట్ కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, అర్గనైజర్ అన్వేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎండీ లాల, గోనె స్వామి, బుద్ధి ప్రసాద్ పాల్గొన్నారు.

కొమురవెల్లి గ్రామంలో సైంటిస్టుల పర్యటన



కొమురవెల్లిలో రైతు పొలం పరిశీలిస్తున్న సైంటిస్టులు

రెబ్బెన, నవంబర్ 12 : రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలో మంగళవారం సైంటిస్టుల బృందం పర్యటించి, రైతు తిరుపతి వ్యవసాయ క్షేత్రంలో పండించిన వరిని పరిశీలించినట్లు రెబ్బెన ఏవో దిలీప్‌కుమార్ తెలిపారు. డాక్టర్ పీ మధూకర్ (ప్లాంట్ బ్రీడింగ్-ఆర్ఏఆర్ఎస్-జగిత్యాల), డాక్టర్ ఐ తిరుపతి ఎస్ఎంఎస్(క్రాప్ ప్రొడక్షన్-కేవీకే-బెల్లంపల్లి), ఏ నాగరాజు ఎస్ ఎంఎస్(ప్లాంట్ ప్రొటక్షన్-కేవీకే-బెల్లంపల్లి) బృందం పంటను పరిశీలించింది. ఈ మేరకు పలు సలహాలు, సూచనలు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో ఏఈవో రాజేశ్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఏవో దిలీప్‌కుమార్ బాధ్యతలు..

రెబ్బెన వ్యవసాయశాఖ అధికారిగా దిలీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా కేంద్రంలో రిపోర్టు చేశారు. ఆ తర్వాత బాధ్యతలు చేసి, పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని వ్యవసాయశాఖ అధికారులు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

రైతు చట్టాలపై అవగాహన ఉండాలి

సీసీసీ నస్పూర్, నవంబర్ 12 : రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మంచిరాయల జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్పిత మారం రెడ్డి సూచించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గ్రామ రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పురుగు మందులు, విత్తనాల చట్టం, వ్యవసాయ భూమి, కౌలు, అనువంశిక వారసత్వంకు సంబంధి చట్టాల గుర్తించి రైతులకు వివరించారు. ఏ సమస్య ఎదురైనా సాయం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ 15100కు డయల్‌చేసి, సమస్యలను తెలుపవచ్చన్నారు. ఈ సదస్సులో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎండీ సందాని, రాములు, మున్సిపల్ వైర్మన్ సుర్మిళ వేణు, మండల వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

నస్పూర్ : మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకుడు సురేంద్రమోహన్

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలి
- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అధికారులతో సమీక్షా సమావేశం

నస్పూర్, నవంబర్ 12 : పొరపాట్లకు తావులేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు సురేంద్ర మోహన్ అధికారులకు సూచించారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, చంద్రకళతో కలిసి ఎన్నికల అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారుచేయాలని, అందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఓటరు నమోదు గురించి ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 26న విద్యాసంస్థల విద్యార్థులు, యువతతో 2కే రన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ ద్వారా 397 దరఖాస్తులు రాగా, అన్నింటినీ పరిష్కరించనున్నట్లు తెలిపారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సురేంద్రమోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికీ తమ ఏజెంట్లను నియమించాలని, జాబితా రూపకల్పనపై అధికారుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్‌స్థాయి అధికారులను నియమించినట్లు, 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. తుది ఓటరు జాబితాను 2025, జనవరి 6న ప్రకటించనున్నట్లు వివరించారు. అంతకుముందు మొదటిసారిగా కలెక్టరేట్‌కు వచ్చిన సురేందర్‌మోహన్‌కు కలెక్టర్, అధికారులు పుష్పగుచ్ఛం అందజేశారు.

రెబ్బెనలో పోలింగ్ కేంద్రం తనిఖీ..

రెబ్బెన, నవంబర్ 12 : స్పెషల్ సమ్మరి రివిజన్ ఫొటో ఎలక్టోరల్-2025లో భాగంగా రెబ్బెన జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రం 324, 325ను సురేంద్రమోహన్ తనిఖీ చేశారు. ఓటరు జాబితా పరిశీలించారు. ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్‌కుమార్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి గంగాధర్ పాల్గొన్నారు.

దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

నెన్నెల పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరిశ్‌రాజ్

బెల్లంపల్లి, నవంబర్ 12 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషిచేయాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ తెలిపారు. స్థానిక వంద పడకల దవాఖాన ఆవరణలో మంగళవారం డిప్యూటీ డీఎంఎహెచ్‌వోలు సుధాకర్ నాయక్, అనితతో కలిసి తాండూర్, నెన్నెల, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొందరు ఏఎన్ఎంలు గర్భిణులను ప్రభుత్వ దవాఖానలకు తీసుకెళ్లకుండా ప్రైవేటు దవాఖానలకు తీసుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్లంపల్లి వంద పడకల దవాఖానలోనే ప్రసవాలు పొందేలా చూడాలని, పరిస్థితి విషమంగా ఉంటేనే మంచిర్యాల మాతా శిశు దవాఖానకు రెఫర్ చేయాలని సిబ్బంది, వైద్యులను ఆదేశించారు. కొందరు ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులను గుర్తించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని సబ్‌సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది తమ రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరిగా పాటించాలని, ప్రతీ పీహెచ్‌సీలో తప్పకుండా సిటిజన్ చార్ట్, మొత్తం వైద్య సిబ్బంది పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది దవాఖానలో యానిఫాంతో ఉండాలని, రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. మెడికల్ అధికారులు తమ సిబ్బందితో ప్రతి రోజూ జూమ్ మీటింగ్ నిర్వహించి, లోటుపాట్లను సమీక్ష చేసుకోవాలని వెల్లడించారు.

వంద పడకల దవాఖాన తనిఖీ..

వంద పడకల దవాఖానను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. వార్డుల్లో కలియ తిరుగుతూ రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్లు, ఔట్ పేషెంట్ల వివరాలపై ఆరా తీశారు. ఫార్మసీ, వైద్య, తదితర రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వంద పడకల దవాఖాన సూపరింటెండెంట్ రవి, వైద్యులు ప్రసాద్, సీతారామరాజు, ప్రశాంతి, డీపీవో కాంతారావు, ఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేంద్రప్రాణి

నూతనంగా ఎన్నికైన ట్రస్మా సభ్యులు

నస్పూర్/సీసీసీ నస్పూర్, నవంబర్ 12: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా)లో మంచిర్యాల జిల్లావాసులకు సముచితస్థానం లభించింది. మంగళవారం హైదరాబాద్‌లో ట్రస్మా రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ట్రస్మా బాధ్యులు హాజరయ్యారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లెత్తుల రాజేంద్రప్రాణిని ఏకగ్రీవంగా ఎన్నుకుననట్లు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. 30 ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధి కోసం మల్లెత్తుల రాజేంద్రప్రాణి కృషి చేశారని, సింగాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసి ఎంతో మంది ఆధారభిమానాలు చురగొన్నారని పేర్కొన్నారు. తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడంపై రాజేంద్రప్రాణి సంతోషం వ్యక్తం చేశారు. ట్రస్మా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. జిల్లా నుంచి ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెట్టం మల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చిందం చంద్రశేఖర్‌ను నియమించారు. వీరి ఎన్నికపై జిల్లాలోని ట్రస్మా నాయకులు, పాఠశాలల కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

జన్నారంలో వనదర్శిని

దండేపల్లి(జన్నారం) నవంబర్ 12 : పాఠశాల విద్యార్థులకు పర్యావరణ ప్రాధాన్యత, అడవులను కాపాడుకోవాల్సిన అవశ్యకతను క్షేత్రస్థాయిలో పరిచయం చేయాలన్న సంకల్పంతో అటవీశాఖ అధికారులు వనదర్శిణి కార్యక్రమాన్ని జన్నారం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులను అడవుల్లోకి తీసుకెళ్లి, అక్కడ వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కలను అటవీ అధికారులు పరిచయం చేశారు. సీతాకోక చిలుకలు, గడ్డి భూములు, పక్షులు, వన్యప్రాణుల ఆవాసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులున్నారు.

ఇన్‌స్టాలో ఎరా.. రూ.3 లక్షలు స్వాహా

మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 12 : ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యాడ్ చూసి సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మి, మంచిర్యాలకు చెందిన సరిత రూ.3 లక్షలు కోల్పోయిందని మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ దవాఖానలో సరిత నర్సింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నది. సెప్టెంబర్ 9న ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యాడ్‌ను చూసి, వర్క్ ఫ్రం హోమ్ అని ఉండడంతో వారిని సంప్రదించింది. అవతలి నుంచి తేజశ్విని అనే యువతి తనను సంప్రదించి, యాడ్ చూసి స్క్రీన్‌షాట్ పంపించాలని, ఇలా ఇంటి వద్దనే డబ్బు సంపాదించుకోవచ్చునని చెప్పంది. 20 యాడ్స్ చూసి, స్క్రీన్ షాట్ చేసి పంపగా, అందుకు తనకు క్రియేట్ చేసిన ఖాతాలో సెప్టెంబర్ 9న రూ.350 జమచేశారు. మరుసటి రోజు కొన్ని టాస్క్‌లు ఉంటాయని చెప్పారు. వాటిని పూర్తి చేయాలని, ముందుగా రూ.వెయ్యి చెల్లించాలన్నారు. సరిత నగదు చెల్లించగా, అందుకు వారు రూ.3900ను తన ఖాతాలో జమచేశారు. మరో టాస్క్‌కు రూ.5 వేలు కట్టగా, రూ.20 వేలు యాడ్ చేశారు. ఇంకో టాస్క్ ఉందని చెప్పి, రూ.15 వేలు కట్టాలని చెప్పారు. కట్టిన తరువాత టాస్క్ కంప్లీట్ అయ్యిందని, రూ.80 వేలు సంపాదించుకున్నారని తెలిపారు. ఇలా రూ.2 లక్షలు వచ్చిన తర్వాత రూ.50 వేలు చెల్లిస్తే పూర్తి డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చునని చెప్పారు. అందుకు సరిత డబ్బు పంపగా, ప్రాసెస్‌లో ఉందని, ఖాతా ఫ్రీజ్ అయ్యిందని మాయమాటలు చెప్పారు. మళ్లీ సెప్టెంబర్ 11న ఖాతా అన్‌ఫ్రీజ్ చేయాలంటే రూ.లక్ష చెల్లించాలని, లేకపోతే రూ.4 లక్షలు పోతాయని చెప్పారు. అప్పు చేసి, రూ.లక్ష కట్టింది. అరగంట తరువాత రూ.4 లక్షలు విత్ డ్రా చుసుకోండని చెప్పారు. అవి రాకపోయే సరికి మళ్లీ ఓ 20 పాయింట్లను ఒక్కో పాయింట్‌కు రూ.10 వేల చొప్పున కొనుగోలు చేయాలని తెలిపారు. రూ.4 లక్షలు పోతాయని భావించి ఇలా రూ.2.11లక్షలు చెల్లించింది. ఇలా మొత్తంగా రూ.3లక్షలు చెల్లించింది. మోసపోయానని గ్రహించి, వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి, ఫిర్యాదు చేసింది. తిరిగి మంచిర్యాల పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

మరో మహిళ రూ.30 వేలు..

మంచిర్యాలకు చెందిన దూడ స్వాతి ఆన్‌లైన్ మోసం ద్వారా రూ.30 వేలు పోగొట్టుకున్నట్లు సైబర్ క్రైం నుంచి ఫిర్యాదు అందగా, కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా అందరూ జాగ్రత్తగా ఉండాలని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు వస్తాయని నమ్మి మోసపోవద్దని సూచించారు.

కోతులకు ఆహారం వేసిన వ్యక్తికి జరిమానా

జైపూర్, నవంబర్ 12: జైపూర్-భీమారం మధ్యగల అటవీప్రాంతంలో జాతీయరహదారిపై కోతులకు ఆహారం వేసిన శ్రీరాంపూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్‌కు మంగళవారం మంగళవారం అటవీ శాఖ సెక్షన్ అధికారి రామకృష్ణ రూ.2వేల జరిమానా విధించారు. ఉదయం అటవీ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా, గమనించి జరిమానా విధించినట్లు తెలిపారు. రహదారిపై కోతులకు ఆహారం ఇవ్వడం వల్ల కోతులు ప్రమాదాలకు గురై, చనిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు, ప్రయాణికులపై పాల్పడుతున్నాయని తెలిపారు.

అధికారికి మూడేళ్ల జైలు

లక్షెట్టిపేట, నవంబర్ 12 : 2023 సంవత్సరంలో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన అప్పటి మంచిర్యాల సర్కిల్ లక్షెట్టిపేట యూనిట్ డిప్యూటి కమర్షియల్ టాక్స్ అధికారి తోగరు పోచయ్యకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ మంగళవారం తీర్పునిచ్చినట్లు ఆశాఖ పీఆర్వో తెలిపారు. సదరు అధికారి లక్షెట్టిపేట మండలంలో ఓ వ్యాపారి వద్ద లంచం డిమాండ్ చేసి, తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారని తెలిపారు.

ముగ్గురిపై కేసు

దహెగాం, నవంబర్ 12 : అక్రమంగా ఆవులను తరలిస్తున్న కన్నెపల్లి మండలం ముత్తాపూర్ గ్రామానికి చెందిన వలీ హైదర్, మండిగ భీమయ్య, అక్కెపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. 7 ఆవులను బొలేరో వాహనంలో తరలిస్తుండగా, కల్వాడ గ్రామస్తుల సమాచారం మేరకు పట్టుకున్నారు. ఆవులతో పాటు, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. కోసిన గోశాలకు తరలించడంతో పాటు, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

పెంచికల్ పేట్, నవంబర్ 12 : అడవిపంది దాడిలో లోడుపల్లి గ్రామానికి చెందిన రైతు లావుడే శివరాంకు తీవ్ర గాయాలయ్యాయి. ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాం మంగళవారం ఉదయం గ్రామ శివారులోని తన పంట చేనులో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై, ఉండగా అడవిపంది ఒక్కసారిగా దాడిచేసింది. గమనించిన చుట్టుపక్కల రైతులు స్థానిక దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లారు. సదరు రైతుకు పరిహారం అందిస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

బెల్లంపల్లి, నవంబర్ 12 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పిచ్చి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నది. రోడ్లపై వెళ్తున్న చిన్నారులు, పెద్దలు తేడా లేకుండా కరుస్తున్నాయి. తాజాగా సోమవారం రాత్రి, మంగళవారం పలు చోట్ల ఏడు గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి స్టేషన్ రోడ్డు కాలనీకి చెందిన బండెల గణేశ్(58), కుదురుపాక సుశీల(50), బూడిదగడ్డ బస్తీకి చెందిన రెండేళ్ల బాలుడు తొగరి ఆర్విక్, నాలుగేళ్ల బాలుడు భూపల్లి విహాన్స్, హర్షవర్ధన్(22), బాబు క్యాంప్ బస్తీకి చెందిన షేక్ మహబూబ్ (50), టేకులబస్తీకి చెందిన కొదురుపాక సుశీల(50)ను కుక్కలు కరవడంతో గాయాలపాలయ్యారు. వంద పడకల దవాఖానలో చికిత్స పొందారు. మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను అరికట్టడంలో విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, నవంబర్ 12 : మంచిర్యాల తహసీల్దార్ రెహతుల్లా హుస్సేన్ కూతురు రమీసా హుస్సేన్ (12) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మంచిర్యాల సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. బాలిక ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నది. సరిగా హోంవర్క్ చేయలేదని ఇంట్లో మందలించడంతో మనస్థాపానికి గురై, ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి, నవంబర్ 12 : గూడెం వద్ద అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. నంబాల గ్రామానికి చెందిన శిరూప మధూకర్ అశోక్ లేల్యాండ్ వాహనంలో మహారాష్ట్రకు అక్రమంగా 20 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా, సోమవారం రాత్రి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్/హాజీపూర్/ఆసిఫాబాద్ టౌన్/వాంకిడి/దహెగాం, నవంబర్ 12 : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. దాడికి నిరసనగా మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, చంద్రకళ, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దాడిచేసిన వారిని శిక్షించాలని జిల్లా నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గీట్ల సుమిత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెక్రటరీ గోవర్ధన్, కోశాధికారి శ్రీనివాస్, ఉద్యోగులున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగుల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ల సంఘం నాయకులు మధూకర్, ప్రమోద్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. వాంకిడి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్‌కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. దహెగాం మండల కేంద్రంలో ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా గంగాధర్

మంచిర్యాల టౌన్, నవంబర్ 12 : మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా వీ గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌లో పనిచేసిన ఈయన, మంచిర్యాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన శ్రావణ్‌కుమార్ కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానని ఎస్ఈ తెలిపారు.

గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

తాండూర్, నవంబర్ 12 : తాండూర్ మండల కేంద్రం బారెవాడలో గంజాయి మొక్క పెంచుతున్న ఇడిదినేని నాగయ్యపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్ఐ డీ కిరణ్ కుమార్ తెలిపారు. నాగయ్య తన ఇంటి సమీపంలోని పెరట్లో గంజాయి మొక్క పెంచుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి, పట్టుకున్నారు. ఆ మొక్కను స్వాధీనం చేసుకొని, నాగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి అమ్ముతున్నట్లు, పెంచుతున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే 87126 56575 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల పర్యటన

రెబ్బెన, నవంబర్ 12 : బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం వార్షిక కమిటీ సభ్యుల బృందం పర్యటించినట్లు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీకి చేరుకొని పనిస్థలాలు, వట్టివాగు రక్షణ కట్ట, ఉల్లిపిట, డోర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉత్పత్తి, ఉత్పాదకత కోసం అవసరమయ్యే యంత్రాలు, పరికరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల బృందం కార్పొరేట్ జీఎం (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) ఏ మనోహర్, జీఎం(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) కే సాయి బాబా, జీఎం (మార్కెటింగ్)డీ రవిప్రసాద్, ఏజీఎం (ఐఈ) సీహెచ్ వెంకయ్య, డీజీఎం(మార్కెటింగ్) సురేందర్‌రాజు, అడిషనల్ మేనేజర్ దిలీప్‌కుమార్, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, ఖైరిగూడ పీవో ఎం నరేందర్, ఏరియా సెక్యురిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఐదుగురిపై బదిలీ వేటు

వాంకిడి, నవంబర్ 12 : వాంకిడి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదుగురు సిబ్బందిపై బదిలీ వేటు వేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని డీటీడీవో రమాదేవి తెలిపారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఏఎన్ఎం సేవంత, కుక్ హరికిషన్, వర్కర్లు కమల, పెంటయ్యపై వేటు వేసినట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

చెన్నూర్, నవంబర్ 12 : వ్యాపారస్తులు నిషేధిత ప్లాస్టిక్‌